



జనాలతో కిక్కిరిసిన చర్చివీధి - టపాకాయల దుకాణాలవద్ద కొనుగోలుదారుల సందడి

పండుగ సందడి

కొనుగోళ్లతో కిక్కిరిసిన దుకాణాలు

చిత్తూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ కొనుగోళ్లతో చిత్తూరు నగరంలోని ప్రధాన వీధులన్నీ సందడిగా మారాయి. కొత్త బట్టలు, పూజా సామగ్రి , టపాకాయలు కొనుగోలు చేసే వారితో చర్చి వీధి, బజారువీధి, డీఐరోడ్డు, ప్రకాశం హైరోడ్డు తదితర ప్రాంతాలు కిటకిటలాడాయి.కేదార గౌరీవ్రతం నోముల సామగ్రి,పూలు, పండ్లు, టెంకాయల ధరలు బాగా పెరిగాయి.కట్టమంచిలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన టపాకాయల దుకాణాల వద్ద జనసందడి నెలకొంది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. అగ్నిమాపక సిబ్బంది టపాకాయల దుకాణాల వద్ద పర్యవేక్షిస్తున్నారు.

రైళ్లలో చోరీ కేసుల్లో ఓజీకుప్పంవాసుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న విజయవాడ రైల్వే పోలీసులు

విజయవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ప్రయాణికుల వస్తువుల చోరీకి పాల్పడుతున్న కేసుల్లో ఐదుగురు నిందితులను విజయవాడలో రైల్వే పోలీసులు శనివారం అరెస్టు చేశారు.ఇటీవల విజయవాడకు వచ్చే పలు రైళ్లలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు రైల్వే పోలీసులు కేసులు నమోదు చేశారు.జీఆర్పీ సీఐ జేవీ రమణ, ఆర్పీఎఫ్ ఎస్ఐ అలీ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి స్టేషన్ ప్రాంగణంలో ఉన్న సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. చోరీలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించారు. శనివారం విజయవాడలోని రైల్వే మినీ స్టేడియం బస్టాప్ వద్ద నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు.వారు చిత్తూరు జిల్లా, నగరి మండలం, ఓజీ కుప్పం ప్రాంతానికి చెందిన గోగుల జానా నరసింహులు (55), పసుపులేటి సులోచన (61), పసుపులేటి బాబు (67), కె.జనార్దన్ (60)గా గుర్తించారు.వారి వద్ద ఉన్న సుమారు రూ.5లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా మౌర్య

తిరుపతి జేసీకి అదనపు బాధ్యతలు



తిరుపతి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి జాయింట్ కలెక్టర్‌కు నెల్లూరు తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది. అయితే తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఇటీవల జరిగిన బదిలీల్లో పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా పోస్టింగ్ పొందిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో ఇప్పటివరకు రెగ్యులర్ జేసీని నియమించలేదు. తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్యకు జాయింట్ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం తిరుపతి జేసీకి నెల్లూరు తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆ పోస్టులో కూడా తిరుపతి కమిషనరే తదుపరి ఆదేశాలు వచ్చేవరకు కొనసాగనున్నారు.

స్విమ్స్ ఓపీ, ఓటీలకు రేపు సెలవు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా సోమవారం స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ ఆర్వీకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలు మాత్రమే కొనసాగుతాయని, రోగులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నేడు జీఎస్టీ 2.0 ముగింపు సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):జీఎస్టీ 2.0లో భాగంగా నెలరోజుల పాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ఆదివారంతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా చిత్తూరులోని జ్యోతిరావు పూలె భవనంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వివిధ కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.వివిధ శాఖలకు సంబంధించి స్టాళ్ల ఏర్పాటుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



కుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాల్లో పలు చోరీలకు పాల్పడిన వ్యక్తిని కుప్పం పోలీసులు అరెస్టు చేశారు. అతడినుంచి 125 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. కుప్పం డీఎస్పీ పార్థసారథి, రూరల్ ఎస్ఐ మల్లేశ్ యాదవ్ శనివారం అతడి వివరాలు వెల్లడించారు. ఇటీవల రామకుప్పం మండల పరిధిలో జరిగిన ఓ చోరీపై పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం చేస్తుండగా రామకుప్పం మండలం, విజలాపురం సమీపంలో సంతమిట్ట వద్ద గోడ్విన్ మోజెస్ రాజేంద్రన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు జిల్లా అంబూరు తాలూకా ఉదఎందిరం గ్రామానికి చెందిన రాజేంద్రన్ రామకుప్పంలోనే కాకుండా వి.కోటలోనూ చోరీ చేసినట్లు అంగీకరించాడు. ఇతడిపై తమిళనాడు రాష్ట్రంలోనూ 30కి పైగా చోరీ కేసులున్నాయి. రామకుప్పం చోరీ కేసులో 94.3 గ్రాములు, వి.కోట చోరీ కేసులో 29 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు రికవరీ చేశారు.

పాలసముద్రం ఎస్ఐ

అత్యుత్సాహం

● వైసీపీ ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి వ్యాఖ్యలపై టీడీపీ నిరసన

తెలుగు మహిళల అరెస్టు

● ఫిర్యాదు లేకున్నా ఇళ్లకు వెళ్లి మరీ అదుపులోకి తీసుకున్న పోలీసులు



పాలసముద్రంలో కృపాలక్ష్మి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న టీడీపీ నాయకులు

చిత్తూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయ నాయకుల మధ్య పరస్పర ఆరోపణలు, వాటిపై నిరసనలు సర్వసాధారణం. జీడీనెల్లూరు నియోజకవర్గంలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య ఈ ఆరోపణలు నిత్యకృత్యంగా మారాయి. ఈ క్రమంలో శనివారం టీడీపీ నాయకులు జీడీనెల్లూరులో, పాలసముద్రంలో నిరసనవ్యక్తం చేశారు.వీటిపై ఎవరి ఫిర్యాదూ లేకపోయినా పాలసముద్రం ఎస్ఐ చిన్నరెడ్డప్ప అత్యుత్సాహం ప్రదర్శించారు. టీడీపీ నాయకురాళ్ల ఇళ్లకు వెళ్లి మరీ అరెస్టు చేసి జీపు ఎక్కించారు.

ఎమ్మెల్యే థామస్, మాజీ మంత్రి నారాయణస్వామి ఇటీవల పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు.వీటికితోడు ఇటీవల వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పంటుకున్న ఘటన ఇంకాస్త వేడిని పెంచింది.దీని వెనుక వైసీపీ సర్పంచి గోవిందయ్య హస్తం ఉందని పోలీసులు నిర్ధారించి అరెస్టు చేశారు. ఈ క్రమంలో హోంమంత్రి అనిత సహా పలువురు ఎమ్మెల్యేలు దేవళంపేటలో ఇటీవల ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ.. 'నారాయణస్వామి లిక్కర్ స్కామ్‌లో సంపాదించిన సొమ్ము కూతుళ్లకు పంచిపెట్టారు' అన్నారు. దీన్ని ఖండించిన నారాయణస్వామి కూతురు, నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి శుక్రవారం కార్వేటినగరం పోలీసులకు ఎమ్మెల్యే మీద ఫిర్యాదు చేశారు. దీంతో పాటు పాలసముద్రం వైసీపీ నాయకురాలు రమాదేవి కూడా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశారు. తమ ఎమ్మెల్యే మీద ఫిర్యాదు చేయడాన్ని ఖండించిన టీడీపీ నాయకులు శనివారం జీడీనెల్లూరులో కృపాలక్ష్మికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనకు దిగారు. పాలసముద్రం మండలం నరసింహాపురం కూడలిలో కూడా తెలుగు మహిళలు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేసి కృపాలక్ష్మి దిష్టిబొమ్మను దహనం చేశారు.నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక ఎమ్మెల్యేపై బురద చల్లే కార్యక్రమాన్ని చేస్తున్నారని ఆరోపించారు.ఈ నిరసనల ఫొటోలను టీడీపీ మండల, నియోజకవర్గ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేసుకున్నారు.

ఇళ్లకు వెళ్లి.. జీపులో ఎక్కించి..

పాలసముద్రంలో జరిగిన నిరసనల్ని వాట్సా‌ప్‌లో చూసిన అక్కడి ఎస్ఐ చిన్నరెడ్డప్ప ఆ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు మహిళల్ని అదుపులోకి తీసుకున్నారు. మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు రాజేశ్వరి, పెనుమూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ జ్యోతి, పుంగోడి ఇళ్లకు వెళ్లి వారిని జీపులో ఎక్కించుకున్నారు.ఈ సమాచారం అందిన టీడీపీ మండల నాయకులు తాళ్లూరి శివానాయుడు, పెనుమూరు మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు అరుళ్‌నాథన్, ఎస్సీ నేత సాంబశివన్ తదితరులు నరసింహాపురానికి చేరుకున్నారు. ఎవరు ఫిర్యాదు చేశారని తెలుగు మహిళలను అరెస్టు చేశారంటూ ఎస్ఐని గట్టిగా నిలదీశారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, నగరి డీఎస్పీ అజీజ్‌లకు అక్కడి నుంచే ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మందలింపుతో మహిళల్ని వదిలి ఎస్ఐ అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఈ విషయం ఎమ్మెల్యే థామస్ వరకు వెళ్లడంతో ఆయన ఎస్పీ తుషార్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్పీ కూడా ఎస్ఐ చిన్నరెడ్డప్పను మందలించినట్లు తెలిసింది.

ఎమ్మెల్యేని తిట్టిన వైసీపీ మహిళా నాయకురాలి పట్ల సానుకూలత

పాలసముద్రం మండల వైసీపీ నాయకురాలు రమాదేవి శుక్రవారం ఎమ్మెల్యే థామస్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు కూడా చేశారు. నిరసన వ్యక్తం చేసిన తెలుగు మహిళల్ని ఇళ్లకు వెళ్లి మరీ అరెస్టు చేసిన ఎస్ఐ చిన్నరెడ్డప్ప, ఏకంగా ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసినా రమాదేవిని ఎందుకు పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎస్వీయూలో ముగిసిన యువతరంగ్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవన వికాసానికి కళలు మూలాధారంగా నిలుస్తాయని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు పేర్కొన్నారు. మూడు రోజులుగా ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన యువతరంగ్ - 2025 కార్యక్రమం శనివారం ముగిసింది. సాయంత్రం శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించిన సమాపనోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన విజయభాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడా సాంస్కృతిక అంశాల్లోనూ ప్రతిభను పెంచుకోవాలని కోరారు. కళల్లో మన సంస్కృతి సంప్రదాయాలు నిక్షిప్తమై ఉన్నాయని అభిప్రాయపడ్డారు. గౌరవ అతిథి ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సంగీతం, నృత్యం, కళల పట్ల ఆసక్తిని పెంపొందించినట్లు అయిందని చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ బీవీ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, న్యాయ నిర్ణేతలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.యువతరంగ్‌లో భాగంగా మూడవ రోజైన శనివారం శ్రీనివాస ఆడిటోరియం, అన్నమయ్య భవనం, సెనేట్ హాల్లో సాంస్కృతిక పోటీలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రత్యేక ప్రావీణ్యాన్ని ప్రదర్శించారు.

యూనిస్ మృతదేహం లభ్యం



యూనిస్ (ఫైల్‌ఫొటో)

పలమనేరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని కళ్యాణరేవులు జలపాతం వద్ద ఈనెల 16న గల్లంతైన పలమనేరుకు చెందిన యూనిస్ మృతదేహం ఎట్టకేలకు శనివారం లభ్యమైంది. అగ్నిమాపక సిబ్బంది అతి కష్టంపై కళ్యాణరేవులు జలపాతం లోయ నుంచి శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి శనివారం యూనిస్ ఇంటికి వెళ్లి అతడి కుటుంబీకులను పరామర్శించారు.

26 మండలాల్లో మోస్తరు వాన

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో గడిచిన 24 గంటల్లో 26 మండలాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా సోమలలో 24.6 మి.మీ అత్యల్పంగా శాంతిపురం,వి.కోటల్లో ఒక మి.మీ చొప్పున వర్షం కురిసింది. మండలాల వారీగా..రొంపిచెర్లలో 13.8, సదుంలో 23.2, పులిచెర్లలో 2, వెదురుకుప్పంలో 7.2, నింద్రలో 20.6, విజయపురంలో 5.2, నగరిలో 4.6, కార్వేటినగరంలో 6,.4, పెనుమూరులో 1.8, పూతలపట్టులో 9.2, ఐరాలలో 8.2, చౌడేపల్లెలో 9, పుంగనూరులో 2.2, గంగాధరనెల్లూరులో 1.2, పలమనేరులో 2.2, బైరెడ్డిపల్లెలో 2.6,బంగారుపాళ్యంలో 3,.6, యాదమరిలో 3, చిత్తూరు అర్బన్‌లో 1.2, పాలసముద్రంలో 12,2 మి.మీ వర్షపాతం నమోదైంది.

320 పాఠశాలల్లో చెకుముకి పరీక్షలు

పలమనేరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 320 పాఠశాలల్లో 22 వేల మంది విద్యార్థులు శనివారం చెకుముకి పరీక్షలు రాశారని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి యుగంధర్‌బాబు తెలిపారు. 8, 9, 10 తరగతుల విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు నవంబరు 1వ తేదీన మండలస్థాయి పరీక్షలకు హాజరవుతారన్నారు. అలాగే జిల్లాస్థాయి పరీక్షలను నవంబరు 23న, రాష్ట్రస్థాయి పరీక్షలను డిసెంబరు 12, 13, 14వ తేదీల్లో నిర్వహిస్తారని తెలిపారు.



కొట్టుకుపోయిన జీడిరేవుల వంక కల్వర్టు

సోమల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం సోమల-నంజంపేట మార్గంలో సరస్వతీపురం వద్ద ప్రవహిస్తున్న జీడిరేవుల వంకపై నిర్మించిన తాత్కాలిక మట్టి కల్వర్టు కొట్టుకుపోయింది. శనివారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షంతో సోమల, అడుసుపల్లె, ఇతర ప్రాంతాల నుంచి వర్షపు నీరు అధికంగా జీడిరేవుల వంకకు చేరడంతో పాటు భారీ వర్షంతో కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో సోమల వైపునుంచి పెద్దఉప్పరపల్లె, నంజంపేట, ఆవులపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు, చిన్న ఉప్పరపల్లె పంచాయతీలకు రాకపోకలు స్తంభించాయి. ఆర్టీసీ బస్సు సర్వీసులు ఆపేశారు. వంతెన నిర్మాణానికి నోచుకోలేదు.

గజ బాధిత రైతులకు నష్ట పరిహారం


బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లిస్తున్న అధికారులు, నాయకులు

కల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో ఏనుగుల దాడుల్లో పంటలు కోల్పోయిన 18 మంది బాధిత రైతులకు శనివారం రూ.3,18,500 నగదును చెక్కుల రూపంలో నష్ట పరిహారంగా చెల్లించినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్‌షఫి, ఎఫ్‌బీవోలు మధు, కృష్ణమూర్తి, విజయభాస్కర్ తెలిపారు. రైతు రామనాథంనాయుడుకు రూ.34 వేలు, ఈశ్వరయ్య రూ.12 వేలు, కృష్ణయ్యకు రూ.39,200), వెంకట్రామయ్యకు రూ.17,100), సుబ్రహ్మణ్యానికి రూ.13,200, శంకరయ్యకు రూ:18 వేలు, విజయసారథి నాయుడుకు రూ.24,200, వెంకటముని నాయుడుకు రూ.14 వేలు, నరసింహులుకు (రూ.5400), జయపాల్‌కు రూ.1600, రెడ్డిశేఖర్‌నాయుడుకు రూ:8000, వెంకటాచలం రూ.79,800, సుందర రూ.52 వేలు నగదు చెక్కులను అందజేశారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు మురళీధర్, నాయకులు వెంకటముని నాయుడు, రైతులు, ట్రాకర్స్ పాల్గొన్నారు.

మానవ జాతికి మొక్కలే శ్వాసకోశాలు


కుప్పం ప్రభుత్వాస్పత్రిలో మొక్కలు నాటుతున్న తులసీనాథ్


పలమనేరు: ఆస్పత్రిలో మొక్కలు నాటుతున్న వైద్యులు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

కుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మానవ జాతికి మొక్కలే శ్వాసకోశాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రెస్కో డైరెక్టర్ ఎన్ఎస్.తులసీనాథ్ అన్నారు. కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయ కుమారి, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** మొక్కలే జీవకోటికి ప్రాణాధారమని.. మొక్కలను పెంచడం అలవాటుగా మార్చుకోవాలని ఏరియా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ యుగంధర్ తెలిపారు. శనివారం పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, టీడీపీ నాయకులు ఆర్.వి. బాలాజీ, గిరిబాబు, సుబ్రహ్మణ్యంగౌడు, ఖాజాపీర్, చిన్నా, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీపీఎస్ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పలువురు టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీడీపీలోకి 35 వైసీపీ కుటుంబాలు


టీడీపీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలుజరుగుతున్నాయి. మండంలోని 35 కుటుంబాలు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రాజగోపాల్ అధ్యక్షతన శనివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ పసుపు కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పంలో ప్రతి ఇంటిపై టీడీపీ జెండా ఎగురవేయడమే తమ లక్ష్యమన్నారు. అందుకు తగ్గట్టుగా సీఎం కూడా వేల కోట్ల రూపాయల వ్యయంతో నియోజకవర్గ అభివృద్ధికి పలు పథకాలు రచించి అమలు చేస్తున్నారన్నారు. నిజమైన ప్రజాపాలన అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి ఎనలేని మద్దతు లభిస్తుందనడానికి ఇప్పటి ఈ చేరికలే ముఖ్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో సైతం మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. గ్రామ పర్యటనలు జరిపి, ప్రజలతో మమేకమై వారి సమస్యలను తీరుస్తామని హామీ ఇచ్చారు. రాబోయే ప్రతి ఎన్నికలో టీడీపీ విజయ ఢంకా మోగించడం ఖాయమని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన కుటుంబాల ప్రతినిధులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పాలనపై ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాంబశివం, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రామచంద్ర, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు చంద్ర, బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జీలు ఆర్ముగం, ప్రకాశ్, మోహన్, విభూషణ్, సంపత్, యువరాజ్, మహేంద్ర, శేఖర్, సంధ్య, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.







రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎల్లంకివారిపల్లి, కల్లూరు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి హాకీ, వాలీబాల్ పోటీలకు పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు లిఖిత, వినయ్, కల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థి మహమ్మద్‌సాద్ ఎంపికైనట్లు ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, హెచ్ఎంలు శ్రీవాణి, హరిశంకర్ తెలిపారు. ఎల్లంకివారిపల్లి ఉన్నత పాఠశాలలో 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు లిఖిత, వినయ్ శుక్రవారం చంద్రగిరిలో జరిగిన జిల్లా స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. కల్లూరు ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న మహమ్మద్‌సాద్ కురబలకోట మండలం ఆంగళ్లులో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. జిల్లా స్థాయి హాకీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన లిఖిత, వినయ్, మహమ్మద్‌సాద్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికచేశారు. ఈనెల 25 నుంచి 29 వరకు తూర్పు గోదావరి, తిరుపతి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు పాల్గొంటారని ఎంఈవోలు తెలిపారు.



సమయ పాలన ముఖ్యం


క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం మోహన్ రెడ్డి

కుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సమయ పాలన పాటించడమే కాక సకాలంలో ఉపాధ్యాయులందరూ పాఠాలు పూర్తి చేయాలని క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి అన్నారు. కుప్పం మండలంలోని అడవిబూదుగూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం క్లస్టర్ సముదాయపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల నమోదు 100 శాతం ఉండాలని, వర్క్ బుక్‌లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని చెప్పారు. సమావేశంలో క్లస్టర్ పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

22న వృక్షాల వేలం

రామకుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని డా.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి అడ్డుగా ఉన్న 67 వృక్షాలను తొలగించేందుకు ఈనెల 22న వేలం వేయనున్నట్లు ప్రిన్సిపాల్ రజనీకుమార్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 22న జరిగే వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంతోపాటు ఆదాయం దక్కుతుందని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జి.మునిరాజు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం ప్రకృతి వ్యవసాయ విస్తరణపై రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంతో చేకూరే ప్రయోజనాలను రైతులకు వివరించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌పై విద్యార్థులు నైపుణ్యత ను పెంపొందించడానికే చెకుముకి పోటీలు నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక సభ్యుడు రామలింగయ్య తెలిపారు. శనివారం స్థానిక బసవరాజ జడ్పీ హైస్కూల్ ఆవరణలో మండల స్థాయి విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు.



పదోన్నతి పొందిన ఉద్యోగులకు సన్మానం


ఉద్యోగులకు సన్మానం చేస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

పెద్దపంజాణి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణిలో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బదిలీపై వెళ్లిన ఇద్దరు ఉద్యోగులను శనివారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో బాలాజీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఏఓగా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ ఎంపీడీవోగా పదోన్నతి పొంది పలమనేరుకు బదిలీ అయ్యారు. సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాజశేఖర్ డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొంది తవణంపల్లెకు బదిలీ అయ్యారు. వీరిని శాలువ, పూలమాలలతో సత్కరించారు. డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి, ఏపీవో మురుగేష్, ఎంఈవో గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, సర్పంచ్ రమేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ నాగరాజ, జూనియర్ అసిస్టెంట్ సతీష్‌కుమార్, ఉపాధి సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

కైగల్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



బైరెడ్డిపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలంలోని కైగల్ జలాశయ ప్రాంతాన్ని టూరి జం స్పాట్‌గా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. కైగల్ జలపాతాన్ని శనివారం టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. కైగల్‌ను టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వ స్థలం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, తహసీల్దార్ ప్రసన్నకుమార్, పలువురు నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల గుంపు దాడి

- పులిచెర్లలోకి మళ్లీ ప్రవేశించిన 7 గజరాజులు
- ఆందోళనలో రైతులు


ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోకి శుక్రవారం రాత్రి ప్రవేశించిన ఏనుగుల గుంపు పంటలపై బీభత్సం సృష్టించాయి. మూడేళ్లుగా మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న 17 ఏనుగుల గుంపులో కొన్నాళ్ల క్రితం ఒక ఏనుగు ప్రమాదవశాత్తు మృతి చెందింది. మిగిలిన ఏనుగుల గుంపులో పది రోజుల క్రితం 5 ఏనుగులు సోమల మండలం వైపు వెళ్లిపోగా 9 ఏనుగుల గుంపు కళ్యాణి డ్యాం వైపు వెళ్లిపోయాయి. ఇందులో ఒంటరిగా మిగిలిన ఒక ఏనుగు మాత్రం మండలంలో పంటలను ధ్వంసం చేస్తూ అపార నష్టం కలిగించింది. అయితే సోమల మండలంలో పంటలను ధ్వంసం చేస్తున్న 5 ఏనుగుల గుంపు శుక్రవారం పగలు కల్లూరు సమీపంలోని పశ్చిమ విభాగంలోని గోగులమ్మ వంక వద్దకు చేరుకున్నాయి. గోగులమ్మ వంక వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపులో ఇదే ప్రాంతంలో ఒంటరిగా తిరుగుతున్న ఏనుగు కలిసిపోయింది. శుక్రవారం రాత్రి గోగులమ్మ వంక నుంచి బయలుదేరిన 6 ఏనుగుల గుంపు పాతపేట మీదుగా కల్లూరు సినిమా థియేటర్ వద్దకు చేరుకున్నాయి. రైతు రామకృష్ణయ్యకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ ఇటీవల ఏనుగు మృతి చెందిన ప్రాంతానికి ఏనుగులు చేరుకున్నాయి. గురప్పకు చెందిన అర ఎకరా వరిపంటను ధ్వంసం చేసి నానా బీభత్సం చేశాయి. అక్కడి నుంచి ఈ ఏనుగుల గుంపు కల్లూరు తలారివారిపల్లి మీదుగా ఎద్దులవారిపల్లి వద్దకు చేరుకున్నాయి. రైతులు శ్రీరాములు, చెంగ్రాయులు, ఇక్బాల్‌కు చెందిన మామిడి, ఉలవ చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు బీఎంసీ గోడౌన్ సమీపంలో కర్నూలు-చిత్తూరు హైవేను దాటుకొని తూర్పు విభాగం అటవీ ప్రాంతం పరిధిలోకి చేరుకున్నాయి. రైతులు జబ్బార్, గోపి, చంద్రయ్య, యర్రయ్యకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కోటపల్లి మీదుగా తూర్పు అడవిలోని బోదబండ వద్దకు ఏనుగుల గుంపు చేరుకున్నాయి. శనివారం పగలంతా బోదబండ వద్ద 6 ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

ఎమ్మెల్యేని సన్మానించిన ఏఎంసీ కార్యవర్గం


ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న ఏఎంసీ నూతన కార్యవర్గం

పలమనేరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శనివారం పలమనేరు ఏఎంసీ నూతన కార్యవర్గం ఘనంగా సన్మానించింది. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంపై ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో ఛైర్మన్ ఆలకుప్పం రాజన్న, డైరెక్టర్లు రుద్రమూర్తినాయుడు, కుమార్ రఘు, సోమశేఖర్, రెడ్డెప్ప, నదీమ్, శంకరప్ప, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు, నాయకులు రాంబాబు, చంద్రశేఖర్, హరి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి సంబరాలు



పుంగనూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి పాఠశాలలో శనివారం ముందస్తు దీపావళి పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి టపాసులు కాల్చారు. టపాకాయలు కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పిల్లలకు వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే సీఎం చంద్రబాబు లక్ష్యం

రామకుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. శనివారం మండల పరిధి మణీంద్రం పంచాయతీ కృష్ణరాజపురం గ్రామంలో ఉచిత రక్తపరీక్షా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాకారం చేయాలన్న తలంపుతో సీఎం చంద్రబాబు కుప్పంలో ప్రయోగాత్మకంగా 42 రకాల రక్తపరీక్షలు చేయించి ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు మంజునాథరెడ్డి, వడ్డెరసాధికార సమితి రాష్ట్ర సభ్యుడు భానుమూర్తి, బూత్ కన్వీనర్ మోహన్, నేతలు చంద్రశేఖరరెడ్డి, మంజునాథ్ తదిరులు పాల్గొన్నారు.

మోపూరులో పుంగనూరువాసి మృతి

డక్కిలి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం మోపూరు శివారు ప్రాంతంలో పుంగనూరుకు చెందిన రమేష్(45) మృతిచెందాడు. ఏడేళ్లుగా మోపూరు క్రాస్ రోడ్డులో వడ్రంగి పనులు చేసుకొంటూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. శనివారం ఉదయం మోపూరు శివారు ప్రాంతంలో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- ఒకరికి తీవ్రగాయాలు


వెంకట్రామప్ప మృతదేహం

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని శాంతిపురం మండలం బడుగుమాకులపల్లె సమీపంలోని పాలారు వంతెన వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా.. మరొకరు తీవ్ర గాయాలకు గురయ్యారు. రాళ్ల బూదుగూరు పోలీసుల కథనం మేరకు.. శాంతిపురం మండలం కెనమాకులపల్లెకు చెందిన వెంకట్రామప్ప(55), సత్యప్ప(58) ద్విచక్రవాహనంపై బడుగుమాకులపల్లెలో వ్యవసాయ పరికరాలు కొనుక్కొని తమ గ్రామానికి బయలుదేరారు. మార్గం మధ్యలో పాలారు బ్రిడ్జి వద్ద వి.కోట వైపు నుంచి వచ్చిన కారు అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడగా.. వీరిలో వెంకట్రామప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సత్యప్పను కుప్పం ఆస్పత్రికి తరలించారు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్వం అవగాహన సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణలో జాతీయ స్థాయి అగ్రగామి శిక్షణా సంస్థగా విశ్వం విద్యాసంస్థలు నిలిచాయని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రంలో శనివారం అవగాహన సదస్సు జరగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లుగా విశ్వం విద్యా సంస్థలు సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అగ్రస్థానాలు సాధిస్తోందని చెప్పారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల చివరి తేదీ అక్టోబరు 30 అని వెల్లడించారు. 4వ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు అర్హులని తెలిపారు. వివరాలకు 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లలోగాని సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఆయుధ పూజ

కుప్పం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): కుప్పం మండలం చెక్కునత్తం సచివాలయలో శనివారం దసరా, ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి, బీరప్ప, మునిరత్నం, తిమ్మప్ప, బాలు, పంచాయతీ కార్యదర్శి మురళీ పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో నరహరిపేట విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నరహరిపేట జడ్పీ హైస్కూల్ జట్టు

గుడిపాల, అక్టోబరు, 18 (ఆంధ్రజ్యోతి): నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో నరహరిపేట క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం దుర్వాసులు, పీడీలు రవి,గురుమూర్తి తెలిపారు. బాలికల అండర్-17 ఫ్రీస్టైల్ విభాగంగా మహాలక్ష్మి, అండర్-19లో శరణ్య బాలురఅండర్-17లో గోవర్ధన్ , అండర్-17లో 71కేజీల విభాగంలో ప్రకాష్, 80 కేజీల విభాగంలో జయచంద్ర, అండర్-17 గ్రీకోరోమన్‌లో పురుషోత్తం, అండర్-19లో 60 కేజీల విభాగంలో చైతన్య ప్రసాద్ ప్రథమస్థానం సాధించారు. చిత్తూరులో నిర్వహించిన అండర్-14 బాలుర సైక్లింగ్‌లో సతీష్, అండర్-17లో సంతోష్, అండర్- 19లో ప భార్గవి ద్వితీయ స్థానం సాధించారని హెచ్‌ఎం అభినందించారు.

మాడవీధుల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఈవో పెంచలకిషోర్ సిబ్బందితో కలిసి ఆలయ మాడ వీధులలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆధ్యాత్మికత ఉట్టిపడుతుందన్నారు.పరిశుభ్రంగా ఉంచుకోవడం సమష్టి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలో రవీంద్రబాబు, ఎస్వీ.కృష్ణారెడ్డి, ధనంజయ, ప్రసాద్, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, సూపరింటెండెంట్లు కోదండపాణి, బాలరంగస్వామి ఆపాల్గొన్నారు.







డ్రంకెన్‌డ్రైవ్‌లో 18మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపిన వారికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. రెండు రోజులుగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలోవాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలను నడిపిన 15 మంది కేసు నమోదు చేశారు. వారిని శనివారం నాల్గవ అదనపు కోర్టు జడ్జి ఉమాదేవి ముందు హాజరుపరిచారు. రూ.10వేల వంతున జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

నిబంధనలు పాటించకుంటే లైసెన్స్‌ల రద్దు

గుడిపాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రయాలలో నిబంధనలు పాటించకపోతే లైసెన్స్‌లు రద్దు చేస్తామని తహసీల్దార్ శ్రీపివాసులు, ఎస్ఐ రాంమోహన్ విక్రయదారులను హెచ్చరించారు. గుడిపాలలో టపాకాయల విక్రయ కేంద్రాలను శనివారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ టపాకాయలు విక్రయించే ప్రదేశంలో ఇసుక, నీరు ఏర్పాటు చేయాలన్నారు. హైవేలో దుకాణాలు పెట్టరాదన్నారు.

అన్నప్రసాదం నాణ్యతపై ఆరా



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ఈవో పెంచలకిషోర్ భక్తులతో కలసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శుక్రవారం ఆయన ఆలయ సిబ్బందితో కలసి అన్నప్రసాద కేంద్రాన్ని తనిఖీ చేయడానికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన అందరితో పాటు పంక్తిలో భోజనం చేశారు. అన్నప్రసాదం రుచి గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు, ఆయనతో పాటు ఏఈవోలు రవీంద్రబాబు,ఎస్వీ.కృష్ణారెడ్డి,ధనుంజయ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దేవర గుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

డివైడర్‌ను ఢీకొట్టిన వాహనం

వెదురుకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంట చెక్‌పోస్టు సమీపంలో శనివారం డివైడర్‌ను ఓ వాహనం ఢీకొట్టింది. ఎవరికీ గాయాలు కాలేదని సమాచారం. సిగరెట్లు, హాన్స్ ప్యాకెట్లు అందులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వాహనం ముందు భాగం దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

పూర్వ విద్యార్థుల వితరణ

వెదురుకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కత్తెరపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలకు 1983-84 బ్యాచ్ విద్యార్థుల శనివారం బీరువాను వితరణగా అందజేశారు. హెచ్‌ఎం బి.చెంగల్రాజుకు దీనిని అందజేశారు.

ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సమీపంలో ఉన్న శిష్ట సౌందర్య వల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం అభిషేక పూజలు, ప్రదోష కాల పూజలు చేశారు.

సత్యసాయి శతజయంతి వేడుకకు ఆహ్వానం

చిత్తూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శత వర్ష జన్మదినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను సత్యసాయి భక్త సహాయ సంఘం సభ్యులు ఆహ్వానించారు. శనివారం సత్యసాయి భక్త సహాయ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, సభ్యులు శంకర్, గజేంద్ర, శ్రీనివాసన్, ప్రభాకర్ తదితరులు ఎమ్మెల్యేను కలసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

సోలార్ వినియోగంపై అవగాహన

పూతలపట్టు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శనివారం జీఎస్టీ, సోలార్ వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నెడ్‌క్యాప్ అధికారులు సోలార్ వినియోగిస్తే జీఎస్టీ తగ్గుతుందనే విషయంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో శివకుమార్, ఎస్ఈ ఇస్మాయిల్, నెడ్‌క్యాప్ జూనియర్ మేనేజర్ సుధాకర్, డీఈ మునిచంద్ర, ఎంపీడీవో నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో మధురవాణి, ఏపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కృపాలక్ష్మి తీరుపై టీడీపీ నాయకుల నిరసన



గంగాధరనెల్లూరులో టీడీపీ నాయకుల ధర్నా

గంగాధరనెల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో మద్యం తాగి ఎందరో ప్రాణాలు కోల్పోయారని రాష్ట్ర టీడీపీ తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు వై.వి.రాజేశ్వరి, జిల్లా టీడీపీ తెలుగు మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, మాజీ ఎంపీపీ ఇందిరమ్మలు అన్నారు. వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ప్రభుత్వవిప్ థామస్‌పై ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ ఇక్కడి బస్టాప్ కూడలిలో పలువురు మహిళలు, టీడీపీనేతలు ధర్నా నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, లోకనాథనాయుడు, ముప్పిరి మోహన్‌నాయుడు, శ్రీధర్‌యాదవ్, దేవసుందరం, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు. **పాలసముద్రం:** నరసింహాపురం కూడలిలో కృపాలక్ష్మి దిష్టిబొమ్మను టీడీపీ నాయకులు దహనం చేశారు. కృపాలక్ష్మికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీడీపీనాయకులు రాజేశ్వరి, అరుళ్‌నాథన్, డైరెక్టర్లు జ్యోతి, నాయకులు సాంబశివన్, శేఖర్‌రాజు, బాలాజీనాయుడు,నవీన్‌చౌదరి పాల్గొన్నారు.

జనసేన ఆందోళన



జనసేన కార్యకర్తలతో నిరసన తెలుపుతున్న జనసేన శ్రేణులు

వెదురుకుప్పం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మిపై కేసు నమోదు చేసేంతవరకూ తమ పోరాటం ఆగదని మాల కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న హెచ్చరించారు. శనివారం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద జనసైనికులతో నిరసన వ్యక్తం చేశారు. సర్పంచ్ గోవిందయ్య వెనుక పాత్రదారులైన నారాయణస్వామి, కృపాలక్ష్మిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. దీనిపై ఎస్పీ, డీఎస్పీ స్పందించి వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న సుదర్శన్

తవణంపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి వయో వందన యోజన కార్యక్రమాలను సమీక్షించారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రెండు నాటు తుపాకుల స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపిస్తున్న అధికారులు

వెదురుకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి నుంచి రెండు నాటు తుపాకీలను స్వాధీనం చేసుకున్నామని కార్వేటినగరం అటవీ క్షేత్రాధికారి వెంకటసుబ్బయ్య తెలిపారు. కార్వేటినగరం ఫారెస్టు కార్యాలయం వద్ద శనివారం ఆయన మీడియాకు వెల్లడించిన వివరాలిలా. ముందస్తు సమాచారంతో దాసరినత్తం వద్ద డీఆర్వో ఆనందరెడ్డి, ఎఫ్ఎస్‌వో లోకేశ్, ఎఫ్‌డీవోలు వినోద్, సతీష్, దొరస్వామితో కలసి దాడి నిర్వహించారు. ఈ క్రమంలో వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ షికారీ కాలనీకి చెందిన శ్రీరామ్ దగ్గర రెండు నాటు తుపాకీలను గుర్తించారు. రెండు రీఛార్జిబుఅల్ బ్యాటరీలు, రెండు హెడ్ లైట్స్, ఒక ఛార్జర్‌తో పాటు ముంగిస మాసం కేజీ, ముంగిస తలకాయను గుర్తించి సీజ్ చేశారు. నిందితుడి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్రీరామ్‌ను అరెస్టు చేసి శనివారం రిమాండుకు తరలించామని వెంకటసుబ్బయ్య వివరించారు.

ఎన్టీఆర్ జలాశయానికి హారతి



జలాశయానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

పెనుమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కలవగుంట వద్ద ఎన్టీఆర్ జలాశయం పూర్తి స్థాయిలో నిండింది. దీంతో దిగువకు నీరు విడుదల చేశారు. ఈ జలాశయం నుంచి చిత్తూరు నగరానికి తాగునీరు సరఫరా అవుతుంది. ఈక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మునిసిపల్ చైర్మెన్ ఆముద, కమిషనర్ నరసింహప్రసాద్‌లు జలాశయానికి హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు జయచంద్రనాయుడు, భరత్‌రెడ్డి, సెక్రటరీ గౌస్‌బాషా ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అలవాటు కావాలి



మొక్కలు నాటుతున్న కమిషనర్ కృష్ణారెడ్డి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటడం, పెంచడం అందరూ అలవాటుగా మార్చుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హితవు పలికారు. బీవీరెడ్డికాలనీలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పీవీకేఎన్ కళాశాల ఆవరణలో మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్, ఎంహెచ్‌వో లోకేష్‌లు మొక్కలు నాటారు. ఆర్టీసీ బస్టాండ్‌లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రయాణికులకు క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. డిపో మేనేజర్ రూపశ్రీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డుకార్యదర్శులు పాల్గొన్నారు.

గుజ్జు పరిశ్రమల ధరపై సమావేశం పెట్టాలి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మామిడి కిలోకు గుజ్జు పరిశ్రమలు చెల్లించాల్సి రూ.8పై చెల్లించాల్సిన అంశంపై సమీక్ష నిర్వహించాలని మామిడి రైతుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం కోరింది. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో సమావేశమైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మామిడికి కిలోకు రూ.12 మద్దతు ధరను ప్రకటించి వాటాగా ప్రభుత్వం రూ.4 చెల్లించడాన్ని అభినందించారు. ఫ్యాక్టరీలు చెల్సించాల్సిన రూ.8పై మరోసారి ఫ్యాక్టరీ యాజమాన్యాలు, ప్రజాప్రతినిధులతో అధికారులు సమావేశం పెట్టాలని కలెక్టర్‌ను కలిసి కోరారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిబాబు, ఆనందనాయుడు, రైతులు పాల్గొన్నారు.

విశ్వం అవగాహన సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణలో జాతీయ స్థాయి అగ్రగామి శిక్షణా సంస్థగా విశ్వం విద్యాసంస్థలు నిలిచాయని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రంలో సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లుగా విశ్వం విద్యా సంస్థలు సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో అగ్రస్థానాలు సాధిస్తోందని చెప్పారు. 2025 ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు సాధించడం విశ్వం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల చివరి తేదీ అక్టోబరు 30 అని వెల్లడించారు. 4వ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్ తదితర వివరాలకు వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రంలోగాని, 8688888802 / 9399976999 ఫోన్ నంబర్లలోగాని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి సంబరాలు



వెదురుకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎస్ఎల్ఎన్ విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు దీపావళి సంబరాలను నిర్వహించారు. విద్యార్థులు టపాకాయలను పేల్చారు. కరస్పాండెంట్ ఎ.దిలీప్‌కుమార్, డైరెక్టర్లు ధనంజయరెడ్డి, వెంకటేష్, పురుషోత్తం, ప్రిన్సిపాల్ కిషోర్, హెచ్‌ఎం లత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సీఆర్సీ సమావేశాల తనిఖీ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో

వెదురుకుప్పం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఆదర్శంగా విధులను నిర్వహించాలని, ప్రణాళికబద్ధంగా బోధించాలని డీఈవో వరలక్ష్మి అన్నారు. వెదురుకుప్పం, తిరుమలయ్యపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సీఆర్సీ సమావేశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఎంఈవో దామోదరం ఉన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ



విజయపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పన్నూరు సబ్‌స్టేషన్ పమ్మీల పాఠశాల ఆవరణలో శనివారం భారత్ గ్యాస్ అధినేత ప్రేమ్‌కుమార్ దివ్యాంగులకు వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. నెహ్రూ యువజన సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పాల్‌రత్నం స్మారకదినోత్సవంలో భాగంగా 21 మందికి అందించారు. అనంతరం అన్నా గౌరీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ మమత, సుప్రీంకోర్టు అడ్వకేటు రాగా సందేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి



చిత్తూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళికి ఆయుర్వేద జ్ఞానాన్ని అందించిన వైద్య దేవుడు దన్వంతని భగవాన్‌అని కొనియాడారు. కార్యక్రమంలో నగర నాయిబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు మోహన్, వెంకటరమణ, రమేష్, బీజేపి నేతలు షణ్ముగం, శ్రీనివాసులు, అమిత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోదం చెంతనే ప్రమాదం



డీఎఫ్‌వో పెద్దిరెడ్డి

చిత్తూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సురక్షితంగా దీపావళి పండుగను జరుపుకోవాలని డీఎఫ్‌వో పెద్దిరెడ్డి చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ బాణసంచా కాల్చేటపుడు . ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాద ాలు సంభవిస్తాయన్నారు. పెద్దల సమక్షంలోనే చిన్నపిల్లలు టపాకాయలు కాల్చేవిధంగా చూసుకోవాలన్నారు. ఇంటి బయట, బహిరంగ ప్రదేశాల్లో టపాకాయలు కాల్చాలన్నారు. జిల్లాలో 170 తాత్కాలిక టపాకాయల దుకాణాలు ఏర్పాటుచేశారన్నారు.

ఇవీ ఆయన చేసిన సూచనలు

సగం కాలిన కాలని బాణసంచాపై నీరు, పొడి ఇసుక వేసి ఆర్పివేయాలి. గుడిసెలు, పెట్రోల్ బంక్‌లు సమీపంలో టపాకాయలు కాల్చరాదు. దుకాణాల వద్ద 24 గంటలూ అగ్నిమాపక వాహనం, సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. దుకాణానికి దుకాణానికి మధ్య సుమారు 10 అడుగుల దూరం ఉండేలాచూసుకోవాలి, దుకాణాలవద్ద డ్రమ్ముల్లో నీరు అందుబాటులోఉంచుకోవాలి. నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలను, వైర్లను వినియోగించాలి. విద్యుత్ షార్ట్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దుకాణాలవద్ద టపాకాయలు కాల్చకుండా చూసుకోవాలి. ప్రమాదం సంభవిస్తే వెంటనే సమీపంలోని అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాలి

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఈవో, డీపీవో, నాయకులు

పెనుమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు పేర్కొన్నారు. శనివారం పెనుమూరు బస్టాండులో అధికారులు, ప్రజలతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. పాళ్యం యానాదికాలనీ ఎస్టీ కాలనీలో త్రాగునీరు, టాయిలెట్ పనులను పరిశీలించారు. డీపీవో సుధాకర్‌రావు, మాజీ జడ్పీటీసీ రుద్రయ్యనాయుడు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.యాదమరి: మోర్దానపల్లి సచివాలయంలో శనివారం ఎంపీడీఎవో పెంచల వీరేంద్ర, డిప్యూటీ ఎంపీడీవో రామచంద్ర ఆధ్వర్యంలో 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది శ్రమదానం చేశారు. పారిశుధ్య పనులు నిర్వహించి మొక్కలు నాటారు. సర్పంచ్ మీనా, నాయకుడు వెంకటేష్‌నాయుడు, కార్యదర్శులుపాల్గొన్నారు. నగరి: నగరి మున్సిపాలిటీ పరిధిలో శనివారం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రోడ్లను శుభ్రం చేశారు. మొక్కలు నాటారు.. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రభుత్వ విప్ శ్రీకాంత్



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వరసిద్ధుడిని ప్రభుత్వ విప్ కంచర్లశ్రీకాంత్ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వారిని వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. చైర్మన్ మణినాయుడు, సూపరింటెండెంట్ కోదండపాణి పాల్గొన్నారు.

కనిపించని ఓట్లపై లోతుగా పరిశీలన

గంగాధరనెల్లూరు, అబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 46,790 ఓట్లకు సంబంధించి స్పష్టత రావాల్సి ఉందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఓటర్ల జాబితాపై రాజకీయపార్టీల నేతలు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ పద్ధతి కింద పరిశీలించగా 49.07 శాతం ఓట్లు ఆన్‌లైన్‌లో కనిపించలేదన్నారు. అధికారులు లోతుగా పరిశీలించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు శ్రీనివాసులు, లోకనాథపిళ్లై, ఎన్నికల డీటీ మహేశ్వరి, పార్టీన నాయకులు సుధాకర్, లోకేష్ , నారాయణరెడ్డి, వెంకటేశులురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పరిశీలన

పూతలపట్టు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువుకట్టపై ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌ను సీనియర్ క్వాలిటీ అధికారులు శనివారం పరిశీలించారు. ఇక్కడి సౌకర్యాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. సీనియర్ క్వాలిటీ అధికారి గోపిచంద్ర, డ్వామా పీడీ రవికుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, ఏపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

మహానందికి క్షీరాభిషేకం



ఐరాల(కాణిపాకం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలోని మణికంఠేశ్వరస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి ప్రదోష కాల పూజను ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్ నిర్వహించారు. శివునికి, మహానందికి ఏకకాలంలో అభిషేకం నిర్వహించారు. అనంతరం శివుడిని, మహానందిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహనా ర్యాలీ

నగరి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆటో డ్రైవర్లు వాహనదారులచే ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ జీఎస్టీని ప్రవేశ పెట్టడంతో అన్ని వర్గాల వారికి సూపర్ సేవింగ్స్ లభిస్తుందన్నారు.

ఇళ్లలోకి వర్షపు నీరు



శాంతిపురంలో ఇంటిలోకి వెళ్లిన వర్షపు నీరు

గుడిపాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి నీరు ఇళ్లలోకి చేరుతోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. శాంతిపురంలో పల్లపు ప్రాంతంలోని ఓ ఇంటిలో వర్షపు నీరు పూర్తిగా చేరిపోయింది. గ్రతాళ్ల మిట్ట, ధర్మరాజులపురం, గుడిపాల అరుధంతివాడలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. చెరువు మొరవ పారడంతో గుడిపాల నుంచి చిత్తూరుకు వెళ్లే ఇబ్బంది పడుతున్నారు.

దీపావళి వేడుకలు

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయం విద్యాసంస్థల్లో అధినేత తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ శైలజవమూర్తి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి దీపాలు వెలిగించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







